


# సౌందర్యోపాసకుడు

కె. చిరంజీవి

చుట్టూ తిప్పుకుంటూ లోనికి పరుగెత్తింది. సుబ్బారావు ఆమెను పరకాయించి చూశాడు. క్రితం వేసంగి శెలవుల్లో మొట్టమొదటిసారి ఆమెను చూశాడు. తరవాత క్రిస్మస్‌లో- మొత్తం అంతవరకూ నూట వందొమ్మిది మార్లు చూడడం అతనికి గుర్తుంది. ఆమె నిజమైన సౌందర్యం ఈనాడు చూశా నను కున్నాడు.

పదహారేళ్ళు నిండినా ఆమె ఎదగడం పూర్తికానట్లుగానే వుంది. సన్నటి పొడు గాటి చేతులు, మొనలన్నీ సర్దుకోని భుజాలు. మరో శరీరానికి ఉద్దేశింపబడిన దానిలా కన బడే సన్నటి నడుం! సన్నగిలటం మాను కుని వ్యాపించినచోట, ఏ చీర పడేసినా చిలకొయ్యలా పట్టుకునే వంకర. పూర్ణ చంద్రుడికి అడ్డం వచ్చిన పల్చటి మేఘం లాంటి మెత్తటి శరీరచ్ఛాయ - ఈ సుందరిని చూస్తూ కూర్చోవడం సుబ్బారావుకు ఒక ఉత్కృష్టమైన అనుభవం.

'ఊఁ?' ఎందుకొచ్చారన్నట్లు ప్రశ్నార్థ కంగా ప్రవేశించింది సుందరి. కనుబొమలు ఒక్కసారి వంకర తిరిగాయి. రెండు పెద వులు ముడుచుకుని, చెక్కిళ్ళ చర్మాన్ని లాక్కుని సున్నచుట్టాయి.

సుబ్బారావు సుందరి చీర మడతల్ని లెక్క పెడుతున్నాడు. శరీరంలో ఒంపున్నచోట పదిహేను మడతలు జమకొచ్చాయి.

'ఏం మాట్లాడవేం?' [illegible] పెదవుల్ని సున్నచుట్టింది సుందరి.

'అయితే సుందరీ! ఎవరూ లేరుకాబట్టి ధైర్యంచేసి అడుగుతున్నాను. నిజంచెప్పు. నేనంటే నీకిష్టమేనా?'

ఈ ప్రశ్న అతను పగలు వేసివుండడు. 'ఇష్టమంటే?' కోలగా నవ్వింది సుందరి.

చందమామ సిగ్గుపడి మేఘాల్ని ముసుగేసు కుంది. వేళ్ళు లేకుండానే ఉద్భవించి వృద్ధి పొందిన లతలా పల్చగావుంది ఆ నవ్వు.

'ఏదీ మళ్ళీ నవ్వు',

'నాతో నవ్వుతాలేమిటి? మీరుగావెళ్ళోళ్లు'.

'గొప్పవాళ్ళతో స్నేహం నీకిష్టమేగా?'

'ఇన్నిసార్లు మా యింటి కొచ్చారు. నా కోసరం ఏమన్నా తెచ్చారా? చూపించు జేబు' అంటూ చొక్కాలో చెయ్యిపెట్టి గాలించింది,

'ఇదేంటి? ఛీ పాడు. గడ్డి. దాచుకో' అంటూ అతని ఒంటిమీద పారేసింది.

సుందరి స్పర్శతో అతని శరీరం కంపించి పోయింది. సముద్ర కెరటాలపై నురుగు మంటలుగా లేచి ఆకాశాన్ని ఆవరించుకుంటే మళ్ళీ ఆ జ్వాలను ఆర్పేటందుకు ఆమె శరీరమే తాకాలేమో? నరాలు లాగేస్తున్నాయి. రక్తం మార్గాలు తప్పి పొర్లి పొంగిపోతోంది.

'వెళ్ళండి, నాకు పనుంది'.

'అంతేనా? ఊరికే వచ్చి చూసి పోకూడదా నేను?'

'చూసేందుకేముంది? ఉత్తుత్త చూపు లేగా?'

'నా కవేచాలు. అంతకంటే ఏమీ అక్కర్లేదు.'

అసలు సుందరి స్త్రీ కాదు. ఏదో పొరబాటున ఈ ప్రపంచంలో తమాషా చూపిపోదామని వచ్చిన ఒక స్వప్నసౌందర్యం. సుందరి పెండ్లాడుతుందా? పిల్లల్ని కంటుందా? అంట్లు తోముతుందా? అన్నం వండుతుందా? ఎవరైనా వింటే నవ్వుతారు. అసలు సుందరిని ఏ మగాడూ తాకలేడు. చేతులాడవు. మాట రాదు. కళ్ళు కనబడవు. సుందరిని ఎవరూ పెండ్లి చేసుకోగూడదు. ఏ మగాడికీ చెందగూడదు సుందరి. చంద్రుడు, నక్షత్రాలు, సముద్రం, తాజమహలు, పార్కులు వీటిని అందరూ ఊరికే చూసి ఆనందిస్తారు. అలాగే సుందరి. ఆమె ఒక సామ్యవాదపు సౌందర్య సంస్థ!

'డబ్బు తీసుకుని రేపు రానా?'

'రండి. రేపు రాత్రికి.'

'రాత్రిపూట నాకు భయం. రేపు పగలొస్తాను'.

'బాబో! మీ డబ్బూ వద్దు మీరూ వద్దు. అసలు రాకండి.'

'అయితే నేనంటే నీకిష్టం లేదన్నమాట?'

'అలాగంటే రక్కుతాను. వెళ్ళండి. ఎప్పుడూ రాకండి.'

వెనుదిరిగాడు సుబ్బారావు.

"వెడుతున్నారా?" అంది సుందరి. అతనేమీ మాట్లాడలేదు.

* * *

సుందరి ముందు మాట్లాడుతున్నంతసేపూ చలిమంట కాగుతున్నట్లుగా వుంటుంది సుబ్బారావుకు. వాతావరణం వేడితో బరువెక్కిపోతుంది. అంతా... వేడి... వేడి... వేడి... వెలుగు మాత్రం ఉండదు.

చీకటి. ఉప్పెనలా గాలి గదంతా కమ్మేస్తుంది. కడసారి నృత్యం ముగించిన దీపం మూర్ఛపోతుంది. అంతా చీకటి, సుందరి చేతులు అతని భుజం మీద పడతాయి. సముద్రంలో కొట్టుకుపోయే వ్యక్తికి రబ్బరుబంతి దొరికినట్టుగా ఏదో శక్తి అతన్ని కిందికి నెట్టేస్తుంది. కటిక చీకటి. అతని కళ్ళు సుందరి ఒళ్ళో తెరుచుకుంటాయి. అతని నుదిటిని చలిమంటలా కాల్చివేస్తుంది సుందరి కడుపు. కనురెప్పల్ని ఆమె వక్షాలు మెత్తగా కోసేస్తాయి. ఆమె రెండు చేతులూ అతన్ని ఎక్కడికో ఆవలి తీరానికి

తీసుకు పోతున్నాయి. భరింపరాని సౌంద ర్యపు వెలుగులో అతనికి స్పృహ తప్పింది. శరీరం అనుభవంతో ఆత్మయిపోయింది.

సలసల కాగిన వేణ్ణీళ్ళతో స్నానం చేశాడు సుబ్బారావు. పల్చటి తెల్లచొక్కా తొడుక్కున్నాడు. తెల్లపంచి గూడ కట్టు కోసం తీశాడు. ఎంతో జాగ్రత్తగా పాపిట తీసి తల దువ్వాడు. పట్నం నుంచి తెచ్చిన సెంటు కొంత రాసుకున్నాడు. తలుపు దగ్గ రగా జేరేసి వీధిలోకి నడిచాడు. వీధిలో దీపాలు లేవు, సందు మొగకొచ్చాడు. రెండు మేకలు పడిపోయిన చూరుకిందకి జరిగి జాలిగా అరుస్తున్నాయి. అంతటా చల్లగా నిశ్శబ్దంగా వుంది. చలికి తట్టుకో లేక మేఘాలు చంద్రుడికి దగ్గరగా వస్తున్నాయి. సుందరి ఇంటి దొడ్డి తలుపులు దగ్గరగా జేరేసి వున్నాయి. సందులోంచి తొంగిచూశాడు. నూతి పళ్ళెం మీద సన్నగా తగ్గించిన దీపం కనిపిస్తోంది. రాత్రి దీపం పెడతానంది సుందరి. అంటే ఎవ్వరూ లేరన్నమాట సుందరీ అని పిలవడమా, సకిలించడమా, ఈలెయ్యడమా, తలుపుతట్టడమా, లేక తలు పులు తెరచుకొని నిర్భయంగా లోనికి వెళ్ళ డమా? సుందరి మామూలు స్త్రీ కాదు. అసలు స్త్రీయేకాదు. ఆచారాలు, నైతిక విలు వలు, కట్టుబాట్లు—అన్నిటిని ముంచెత్తి వేసే మహా సముద్రంలోని అఖాతం. అందుకే లోపలికెళ్ళడమంటే అంత భయం.

భయంతో నరాలన్నీ కదిలిపోయి, మళ్ళీ కొత్త పద్ధతిలో సర్దుకున్నాయి. ఎవరో, ఎప్పుడో సహాయపడతారన్న ఆశతోనే మను షులు భయపడేది. ఎవరూ లేరు. ఎప్పుడూ రారని నిర్ధారణ జరిగిపోయి, ఏకాకి అనగానే భయం పోతుంది. తను ఒక్కడే తనకోసం జీవించి ఈ శక్తుల్ని ఎదుర్కోవాలి. అది మొండి, గుడ్డి ధైర్యం కాదు. ఇంద్రియా లన్నిటినీ ఏకగ్రీవంగా జీవింపజేసి, సర్వ శక్తుల్నీ ఇంజాయింపు వేసుకుని, మూడో నేత్రం తెరచుకున్న లేదా చెలరేగిన సాహస మిది.

తలుపు తెరుచుకుని లోనికి వెళ్ళాడు సుబ్బారావు.

అంతా నిశ్శబ్దం. వెన్నెట్లో వస్తువులన్నీ తెల్లటి పొర కప్పుకున్నట్లుగా వున్నాయి. నూతి పళ్ళెం పక్కనే పడుకుని వుంది సుందరి. పైన దుప్పటి కూడా లేదు. తల గడ మీద నుంచి ఊడిపోయిన జడ క్రిందికి వేళ్లాడుతోంది. కుడిచెయ్యి మెడక్రింద, ఎడమచెయ్యి మడచిన మోకాలు మీదా వున్నాయి. చీరకొంగు పొత్తికడుపు మీదికి జారి గాలికి కదులుతోంది. ఇంటికప్పు మీద నుంచి జారిన వెన్నెల నుదుటిని స్పృశిస్తోంది ఆనాటి సౌందర్యం తన యాత్ర ముగించు కుని పవ్వళిస్తోంది!

పరిమళం బరువుకి, రంగు ఒత్తిడికి తట్టుకోలేక ఊడిపడిపోయిన అడవిపువ్వు!

పర్వత శిఖరాన్నుంచి జారి విడిపోయిన మంచుముద్ద.

నిశీధిలో సృష్టి వేసుకున్న మంటలో నడి జ్వాల.

అర్ధరాత్రి జీవులు కన్న స్వప్నంలో మూగబాధ!

ఆమె మొహంలోకి చూశాడు సుబ్బా రావు. విశ్వగానానికి లయశ్రుతులలా విని పిస్తున్న శ్వాస అతన్ని చుట్టుకుంది. ఆక స్మికంగా ప్రాణం తెచ్చుకున్న స్వప్నకాంత శరీరం మోయలేని వేడి, సముద్ర కెరటా లపై బహిర్గతమైన వేడిలా లేస్తోంది. వేసంగి

సాయంత్రం వాన వెలిసిన తరవాత భూమి వదిలేసిన వేడిలాంటిది, ఆ మంట. ఎక్కడా అనిచడానికి చేతులు రావడంలేదు. ఏదో శక్తి అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. సుందరి అతనిలోకి ప్రవేశించి అన్ని తలుపులూ మూసేసినట్లనిపించింది. ఎక్కడ తాకినా అన్ని రేకులూ ఊడిపొయ్యే పుష్పం. వేలితో తాకిన మాత్రానే ఒడలిపోతుంది. రంగులన్నీ పోతాయి. నశింపయిపోతుంది.

"ఇది అన్యాయం. నేనీపని చెయ్యలేను. సౌందర్యాన్ని ధ్వంసం చెయ్యలేను. నేనే సౌందర్యాన్ని. నన్ను నేను ధ్వంసం చేసుకోను" అనుకుంటూ కవరులోవున్న యాభై రూపాయలూ దిండుక్రింద వుంచి తలుపులు దగ్గరగా మూసి, మెల్లగా వీధిలోకి నడిచాడు సుబ్బారావు.

ఆకాశంకేసి చూస్తూ వంతెన మీద కూర్చున్న సుబ్బారావుకి వేలికేదో చుట్టుకున్నట్లనిపించింది. తీసి చూశాడు. నల్లటి పొడుగాటి వెంట్రుక. సుందరి జడలోది.

మరుసటిరోజు ఊరంతా గుప్పుమన్నది. సుందరి అనుభవాన్ని వెదుక్కుంటూ ఎక్కడికో... జీవితంలోకెక్కడికో... మట్టిలోకో... మాలిన్యంలోకో... వెళ్ళిపోయిందని.

ఐతేనేం ? చంద్రుడు, నక్షత్రాలు, సముద్రం, తాజమహాలు- ఇవన్నీ ఉన్నంత కాలం సుందరి తల వెంట్రుక సుబ్బారావు పెట్టెలో తుప్పు పట్టకుండా భద్రంగానే వుంటుంది. *

(కీర్తిశేషులు బుచ్చిబాబుగారి నవల "చివరకు మిగిలేది" మళ్ళీ ఈ మధ్య చదివాక).


మీ పరివారానికి పరిపూర్ణమైన

పఠనానందం ఇచ్చే ప్రత్యేక వారపత్రిక

ప్రజాతంత్ర